

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 75

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.154	236	266
సూర్యాపేట	రూ.145	220	250
నల్లగొండ	రూ.148	216	244

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.5 । కనిష్ఠం 23.4



ఆంధ్రజ్యోతి మూసీ మురిసేనా 4

కాలుష్యకాసారంగా మారిన జీవ నది మూసీ ప్రక్షాళనకు ఆది నుంచి ఆటంకాలే ఎదురవుతున్నాయి. 2005 నుంచి మూసీ ప్రక్షాళనకు ప్రభుత్వాలు శ్రీకారం చుట్టినా ఒక్కటీ ముందుకుపడలేదు. ప్రస్తుత ప్రభుత్వం సైతం కార్యాచరణ అమలుకు పూనుకున్న నాటి నుంచి రాజకీయ వివాదాలు కొనసాగుతున్నాయి. ఈ ప్రభుత్వమైనా ఆటంకాలను అధిగమించి ఇచ్చిన మాట మేరకు మూసీ ప్రక్షాళన చేపట్టాలని ఉమ్మడి జిల్లా మూసీ పరివాహక రైతాంగం కోరుతోంది.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

మూసీ ప్రక్షాళనకు
అన్నీ ఆటంకాలే!

"2005 నుంచి మొదలైన కార్యాచరణ
ప్రభుత్వాలు మారినా ముందుకు సాగని పనులు
కేంద్రం మద్దతు అంతంతే
తాజాగా చేపట్టిన మూసీ ప్రాజెక్టు చుట్టూ రాజకీయం"

మూసీ నది ప్రక్షాళనకు 2005లో శ్రీకారం చుట్టారు. మొత్తం 287 కిలోమీటర్ల ప్రవాహం ఉన్న మూసీ నది హైదరాబాద్ మహానగరంలో ప్రవహించే దాదాపు 58కిలోమీటర్ల పరిధిలో 90 శాతం మేర కాలుష్యానికి గురవుతోంది. ఓ వైపు మహానగరం నుంచి వచ్చే మురుగునీరు, మరోవైపు నగరం చుట్టూ విస్తరించిన పారిశ్రామికవాడల్లోని దాదాపు 12వేల పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్య పూరిత వ్యర్థరసాయనాలు కలవకుండా శుద్ధి చేయడం, మరోవైపు నది కుచించుకుపోయేలా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో ఉన్న ఆక్రమణలు తొలగించడం, మహానగర చెత్త, ఇతర వ్యర్థాలు నదిలో కలపకుండా నిరోధించడం వంటి ప్రధాన పనులు చేపట్టాలని నిర్ణయించారు. అందులో భాగంగా తొలుత మురుగునీటి శుద్ధికి ఎస్టీపీలను నిర్మించాలని నిర్ణయించారు. 2005లో కేంద్రం నిధులు రూ.330 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వ నిధులు కూడా కలిపి నాలుగు ఎస్టీపీలను నిర్మించాలని తలపెట్టారు. వీటిపై అప్పటి ప్రభుత్వాలు శ్రద్ధ పెట్టకపోవడం, స్థానికుల నుంచి ఇబ్బందులు, ఉద్యమాలు, తదితర కారణాలతో 2013 వరకు ప్రాజెక్టు ముందుకు సాగలేదు. చివరకు 2013 నాటికి ఈ నాలుగు ఎస్టీపీలు అందుబాటులోకి వచ్చినా ఆశించిన ప్రయోజనం లేకుండా పోయింది. రాష్ట్ర ఏర్పాటు అనంతరం అప్పటి సీఎం కేసీఆర్ నేతృత్వంలో మళ్లీ 2016లో మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు తెరపైకి వచ్చింది. ప్రక్షాళనతో పాటు మూసీ సుందరీకరణ చేపట్టాలనే లక్ష్యంతో రూ.16,653కోట్ల అంచనాలతో మూసీ రివర్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేశారు. అందులో మూసీ నది నీటి ప్రక్షాళన నిమిత్తం 31 ఎస్టీపీలను నిర్మించేందుకు రూ.3,866కోట్లు ప్రతిపాదించారు. పాత ఎస్టీపీలు, వాటిలో నిర్మాణం పూర్తయిన ఎస్టీపీలు కలిపి మొత్తం 25 ప్రస్తుతం పనిచేస్తుండగా, వీటి ద్వారా సుమారు 775ఎంఎల్‌డీ నీరు శుద్ధి అవుతోంది. ఇంకా 1,200ఎంఎల్‌డీ మురుగునీరు, మరో 1,650 ఎంఎల్‌డీ పారిశ్రామిక వ్యర్థాలు ఇంకా మూసీలో కలుస్తూనే ఉన్నాయి.

మూసీ ప్రక్షాళన చేయకపోతే పరివాహకమంతా రోగాలమయంగా మారుతుందని, జీవజాతుల ఉనికికి ప్రమాదమని శాస్త్రవేత్తల హెచ్చరికలు, కాగ్ నివేదికలు, సామాజికసంస్థల అధ్యయనాల మేరకు 2005 నుంచి మూసీ ప్రక్షాళన పథకాలకు ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారిన ప్రతీ సందర్భంలో మూసీ ప్రక్షాళన అంశం తెరపైకి రావడం, నిధులకొరత, మూసీ పరివాహకంలో ఆక్రమణల తొలగింపుపై స్థానికుల అభ్యంతరాలు, రాజకీయ ప్రతిబంధకాలతో ఈ ప్రాజెక్టు ముందుకు సాగకుండా ఆగిపోవడం పరిపాటిగా మారింది. హైదరాబాద్ దిగువన ఉన్న ఉమ్మడి నల్లగొండ జిల్లా మూసీ పరివాహక ప్రాంత మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రతిపక్ష నాయకులు, ప్రజాసంఘాల నేతలు, సామాజికవేత్తలు మాత్రం ఎప్పటికప్పుడు మూసీ ప్రక్షాళన చేపట్టాలనే అంశానికి కట్టుబడి ఉన్నా, ఆటంకాలను నిరోధించలేకపోతున్నారు. దీంతో మూసీ ప్రక్షాళన ముందుకు సాగడం లేదు.

ప్రక్షాళనకు కేంద్రం మద్దతు కరువు

మూసీనది ప్రక్షాళన ప్రాజెక్టు 2005 నుంచి మొదలుకాగా, కేంద్ర ప్రభుత్వ మద్దతు ఆశించినరీతిలో దక్కడం లేదనే విమర్శలు ఉన్నాయి. 2006లో ప్రభుత్వభాగస్వామ్యంతో చేపట్టిన ప్రాజెక్టుకు రూ.330కోట్లు మాత్రమే కేంద్రం మంజూరు చేసింది. ఈ నిధులకు సమానంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు కలిపి అప్పటి ప్రభుత్వం నాలుగు ఎస్టీపీలను నిర్మించింది. ఈ నాలుగు ట్రీట్‌మెంట్ ప్లాంట్లు 2013లో పూర్తయ్యాయి. ఆ తర్వాత కేంద్రం ఎలాంటి నిధులు ఈ ప్రాజెక్టుకు ఇవ్వలేదు. ప్రస్తుత రాష్ట్ర రోడ్లుభవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎంపీగా ఉన్న సమయంలో..

- మిగతా 6వ పేజీలో

పాత వాటికి టెండర్లు లేవు
కొత్తవాటికి అనుమతులు లేవు

పంచాయతీరాజ్ శాఖలో ముందుకు సాగని పనులు



అటవీశాఖ అనుమతులు రాక అవంతీపురం-గూడూరు మార్గంలో నిలిచిన డబుల్‌రోడ్డు పనులు

మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని పంచాయతీరాజ్ శాఖలో పాత పనులకు టెండర్లు కాకపోగా, కొత్త ప్రతిపాదనలకు అనుమతులు మంజూరు కావడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. మిర్యాలగూడ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లో పంచాయతీరాజ్ శాఖ రెండు నెలల క్రితం గ్రామీణ రోడ్ల నిర్మాణానికి రూ.52కోట్ల ప్రతిపాదనలు, రోడ్ల మరమ్మతులకు రూ.153కోట్ల పనులకు పతిపాదనలను అధికారులు పంపగా ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయలేదు. కాగా, గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో రూ.44కోట్లతో మంజూరైన పనులకు టెండర్లు కాకపోవడంతో నిలిచిపోయాయి.

- (ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ)

మిర్యాలగూడ నియోజకవర్గంలో ఐదు మండలాల్లో సీఆర్ఆర్ కింద 16 పనులకు రూ.30.42కోట్లు, నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని త్రిపురారం, నిడమనూరు, హాలియా మూడు మండలాల పరిధిలో 10 పనులకు రూ.20.54కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు పంపారు. బీటీ రోడ్ల మరమ్మతులకు రూ.153.55కోట్లతో ప్రతిపాదనలు పంపారు. సీఆర్ఆర్‌ఎస్పీ కింద రూ.7.06కోట్ల అంచనాతో మొత్తం 17.116మీటర్ల సీసీ రోడ్లకు, డ్రైన్ల నిర్మాణానికి రూ.5.23కోట్ల మంజూరుకు ప్రతిపాదనలు పంపారు.

అటవీ అనుమతులు రాక నిలిచిన పనులు

మిర్యాలగూడ నియోజకవర్గంలోని కాల్వపల్లి-గూడూరు వరకు జాతీయ, రాష్ట్ర రహదారులను కలుపుతూ అవంతీపురం మీదుగా డబుల్‌రోడ్డు పనులను 2022లో ప్రారంభించారు. రూ.5కోట్ల ప్రాథమిక అంచనా వ్యయంతో ప్రారంభమైన బీటీ రోడ్డు అటవీశాఖ అనుమతులు లేక నిలిచింది. యాద్గార్‌పల్లి, అవంతిపురం ప్రాంతాల్లో నెలకొన్న రైస్‌మిల్లులకు తోడు, అతి పెద్దదైన అవంతీపురం వ్యవసాయ మార్కెట్‌కు వచ్చే వాహనాలు పట్టణంలోకి ప్రవేశించకుండా..

- మిగతా 8వ పేజీలో

ప్రాధాన్య క్రమంలో భూ సేకరణ పూర్తి చేయాలి

కలెక్టర్ సి.నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాజెక్టుల కింద భూసేకరణను ప్రాధాన్య క్రమంలో పూర్తిచేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టులకు గుర్తించిన భూమి, అత్యవసరంగా అవసరమైన భూమి వివరాల జాబితా రూపొందించి ప్రాధాన్య క్రమంలో సేకరణ పూర్తిచేయాలన్నారు. అందుకు రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రభుత్వ, పట్టా, ఫారెస్ట్ భూముల విషయంలో ఆర్డీవో, తహసీల్దార్, డీఎస్‌వోలు సమన్వయ సమావేశం ఏర్పాటు చేసుకొని ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే పరిష్కరించాలన్నారు. భూసేకరణ బడ్జెట్‌కు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. అన్ని ఎత్తిపోతల పథకాల కింద భూసేకరణ ఏ స్థాయిలో ఉన్నా వారం రోజుల్లో అవార్డ్ పాస్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. పట్టా భూముల సంబంధించి రైతుల సమ్మతితో అవార్డ్ పాస్ చేయాలన్నారు. ప్రతీ వారం సమీక్ష ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీఎఫ్‌వో రాజశేఖర్, ఆర్డీవోలు శ్రీరాములు, సుబ్రహ్మణ్యం, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

రెండు మాసాల్లో దర్గాకు ఘాట్ రోడ్డు

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- ఉర్సు ఉత్సవాలు ప్రారంభం
- ఆకర్షణగా నిలిచిన మార్ఫా వాయిద్యాలు



గంధం ఊరేగింపును ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం క్లాక్ టవర్ సెంటర్‌లోని హజ్రత్ సయ్యద్ లతీఫుల్లా షాఖాద్రి దర్గాను భక్తులు దర్శించుకునేందుకు రెండు నెలల్లో ఘాట్ రోడ్డును నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని మదీనా మసీద్‌లో సంప్రదాయ పద్ధతిలో ప్రార్థన అనంతరం గంధం ఊరేగింపును కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దర్గా వద్దకు వెళ్లేందుకు గుట్టపైకి ఘాట్ రోడ్డు నిర్మాణానికి రూ.30కోట్లతో చేపట్టనున్నట్లు తెలిపారు. వృద్ధులు, మహిళలు సైతం దర్గాను దర్శించుకునేందుకు వీలుగా అభివృద్ధి చేస్తామన్నారు. తన హయంలోనే దర్గా అభివృద్ధి చెందిందని, గత 10 ఏళ్లలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. హిందువులు, ముస్లింలు ఐక్యమత్యంతో జరుపుకునే ఉత్సవం ఉర్సు లని, ఈ సంప్రదాయాన్ని భవిష్యత్‌లో కూడా కొనసాగించాలన్నారు. దక్షిణ భారతదేశంలో గుట్టపై ఉన్న ఏకైక దర్గాగా లతీఫుల్లా ఖాద్రీ దర్గా ప్రసిద్ధి చెందిందన్నారు. అనంతరం గంధాన్ని పట్టణ పురవీధుల్లో ఊరేగించగా, గుట్టమెట్ల దగ్గరికి చేరుకోగానే జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు స్వాగతం పలికి దర్గాపైకి తీసుకెళ్లారు. ముతవళ్లులు ధార్మిక కార్యక్రమాలను నిర్వహించారు. గంధం ఊరేగింపులో మార్ఫా వాయిద్య కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లోని ఫంకాలను కూడా ఊరేగింపుగా తీసుకొచ్చారు. పోలీస్ హెడ్‌క్వార్టర్ నుంచి కూడా పోలీస్ గంధాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చారు. దర్గా ప్రాంతమంతా భక్తులతో సందడిగా మారింది. ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా పట్టణ పోలీసులు పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలతోపాటు మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, ముతవళ్లులు సమీల్లా ఖాద్రీ, హవేజ్, ఉబేద్, తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడా లేని విధంగా బొట్టుగూడ పాఠశాల నిర్మాణం

నల్లగొండ టౌన్: రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా రూ.3కోట్లతో జిల్లా కేంద్రంలోని బొట్టుగూడలో ఉన్నత పాఠశాలను నిర్మిస్తున్నట్లు మంత్రి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం పాఠశాల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అన్ని తరగతి గదుల్లో డిజిటల్ పాఠాలకు ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని గదుల్లో ఏసీతో పాటు విద్యార్థులకు లిఫ్ట్ సౌకర్యం కల్పించాలని, పార్కింగ్, అధునాతన టైల్స్, ఫ్లోరింగ్, ఎలక్ట్రిల్ లైటింగ్ పనుల్లో నాణ్యత లోపించకుండా చేపట్టాలని ఆదేశించారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యం



సీఎం కప్ క్రీడా జ్యోతి ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి

నల్లగొండ స్పోర్ట్స్: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సీఎం కప్-2024 టార్చ్ ర్యాలీ గురువారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ సెంటర్‌కు చేరింది. క్రీడా జ్యోతిని అందుకున్న మంత్రి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో క్రీడలపై అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో సీఎం టార్చ్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు క్రీడా జ్యోతిని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ప్రారంభించారు. హైదరాబాద్ రోడ్ నుంచి ఈ ర్యాలీ క్లాక్ టవర్ వరకు సాగింది. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, డీవైఎస్‌వో సిహెచ్.విష్ణుమూర్తిగౌడ్, హఫీజ్‌ఖాన్, శంభులింగం, కిరణ్‌కుమార్, నజీర్, పీఈటీలు పుల్లయ్య, ప్రవీణ్‌కుమార్, గిరిబాబు, కరీం, దాసు పాల్గొన్నారు.

మహిళా హక్కుల కోసం
పోరాటాలు

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

నల్లగొండ రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళలపై అఘాయిత్యాలను ఎదిరించి హక్కుల సాధన కోసం అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తున్నామని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. గురువారం పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో జరిగిన ఐద్వా జిల్లా మహాసభలో ఆమె మాట్లాడారు. మనువాద ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మహిళలపై పలు అఘాయిత్యాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్ రాష్ట్రంలోని ఘటనలు ఎన్నటికీ మరువలేనివని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని విమర్శించారు. పేద మహిళలకు ఉపాధి కల్పించే ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రం నిర్వీర్యం చేసి, నిధులు విడుదల చేయకుండా, పనులు కల్పించకుండా నష్టం చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ మహిళకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చిందని, దీన్ని నేటికీ అమలు చేయలేదన్నారు. పావలా వడ్డీకి రుణాలు లేవని, కనీసం బతుకమ్మకు చీరలు ఇవ్వలేని ప్రభుత్వంగా మిగిలిందన్నారు. ఈ నెల 21 నుంచి 23 వరకు ఖమ్మంలో జరిగే సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తొలుత ఐద్వా కార్యాలయం నుంచి యూటీఎఫ్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంఘం పతాకాన్ని మల్లు లక్ష్మి ఆవిష్కరించి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాలడుగు ప్రభావతిని, కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్, అధ్యక్షుడు నరేష్, ప్రజానాట్యమండలి కళాకారులు చంద్రమౌళి, శంకర్, దైదా జానకమ్మ, ఉమ, మంజుల, పార్వతమ్మ, నాగమణి, ఇందిర, కౌసల్య, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

నకిలీల మాయాజాలం

పుట్టగొడుగుల్లా మార్కెట్లోకి •6లో..

నేలకు వాలిన ఆశలు



నల్లగొండ పట్టణంలో కమ్ముకున్న మబ్బులు



వేములపల్లి మండలంలో వర్షాలకు నేలమట్టమైన వరిపైరు

వర్షాలతో దెబ్బతింటున్న పంటలు

మిర్యాలగూడ అర్బన్, దేవరకొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విత్తనాల సేకరణ మొదలు చీడపీడల నివారణ, దిగుబడుల విక్రయం వరకు అన్నదాత ప్రయాస పడాల్సిందే..! ఇప్పుడిప్పుడే మిల్లుపాయింట్ వద్దకు వచ్చే ధాన్యం ధరలో వ్యాపారుల కోత, వరుసగా కురుస్తున్న వర్షాలకు చేతికొచ్చిన పంట నేలకు వాలిపోతుంటే కనుపాప చెమ్మగిల్లుతోంది. సాగునీటి కష్టాల నుంచి ఊరట దక్కినా గత వారం రోజులుగా ఏర్పడ్డ ప్రతికూల వాతావరణ పరిస్థితులు రైతుకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఎన్నో వ్యయప్రయసాలకోర్చి సాగైన వరిపంటకు నష్టం కలుగుతుంటే కర్షకుల గుండె బరువెక్కుతోంది. ఆశల సాగు ఒడిలో ఫలితం దక్కుతుందో లేదోనన్న బెంగ రైతులను కుంగదీస్తోంది. గురువారం ఈదురుగాలులతో కూడిన వర్షాలకు వేములపల్లిలో కోతదశకు వచ్చిన వరిపైర్లు నేలవాలాయి. దేవరకొండ డివిజన్‌లో సాయంత్రం నుంచి ముసురుతో కూడిన వర్షం కురిసింది. పత్తిచేలు చేతికొచ్చే సమయానికి వర్షం కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. డివిజన్ పరిధిలోని దేవరకొండ, చందంపేట, కొండమల్లేపల్లి, చింతపల్లి, పీఏపల్లి మండలాల్లో ముసురుతో కూడిన వర్షం కురిసింది. ఈ ఏడాది డివిజన్‌లో 1.50లక్షల ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేశారు. జూలై, ఆగస్టు నెలల్లో వర్షాలు లేక, సెప్టెంబరు, అక్టోబరు నెలలో అధికంగా వర్షాల కారణంగా పత్తిచేలకు తెగుళ్ల బెడద అధికమైంది. దీనికితోడు చేతికొచ్చిన పత్తి తాజాగా కురుస్తున్న వర్షానికి తడిసే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఉపాధ్యాయులు ఓటు నమోదు చేసుకోవాలి

టీపీయూఎస్ నేత సాయిరెడ్డి



ఎమ్మెల్సీ ఓటు నమోదు చేస్తున్న టీపీయూఎస్ రాష్ట్ర నాయకులు

నల్లగొండ రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వచ్చే మార్చిలో జరిగే వరంగల్, ఖమ్మం, నల్లగొండ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హత ఉన్న ఉపాధ్యాయులు ఓటును వెంటనే నమోదు చేసుకోవాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు తీకుళ్ల సాయిరెడ్డి కోరారు. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని బొట్టుగూడ హైస్కూల్, రామగిరి బాలుర, బాలికల ఉన్నత పాఠశాల తదితర పాఠశాలల్లో ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ ఓటు దరఖాస్తు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2019లో ఉన్న ఓటర్ జాబితా పూర్తిగా రద్దయినందున ప్రతీ ఒక్కరూ మళ్లీ ఓటును నమోదు చేసుకోవాలని తెలిపారు. ఓటు నమోదుకు నవంబరు 6వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. గత మార్చి నుంచి ఉద్యోగ విరమణ పొందిన వారు కూడా ఓటును నమోదు చేసుకోవచ్చన్నారు. విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం జాతీయవాదులకు అండగా నిలిచి కౌన్సిల్‌కు పంపాలని కోరారు. కార్యక్రమంలో టీపీయూఎస్ రాష్ట్ర సహాధ్యక్షుడు అల్లు బెల్లి పాపిరెడ్డి, రాష్ట్ర శిక్షణ సహ ప్రముఖ్ గుర్రం ప్రభాకర్‌రెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ అధ్యక్షుడు గుంటి మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

• హైదరాబాద్ ప్రదర్శనలో మన బంజారా వస్త్రాలు



దేవరకొండ మండలం మర్రిచెట్టుతండా గిరిజన మహిళలు చేతి కుట్లతో తయారు చేసిన దుస్తులు, వస్తువులను హైదరాబాద్ అమీర్‌పేట కమ్మసంఘం భవనంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. ఈ ప్రదర్శన ఈనెల 22వ తేదీ వరకు కొనసాగనుంది.



పూజల్లో పాల్గొన్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశం

ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలి

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి
- నేత్రపర్వంగా శ్రీవేణుగోపాలస్వామి కల్యాణోత్సవం

చిట్యాలరూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తిలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం స్వామివారి కల్యాణోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలు, పూలమాలతో అలంకరించి కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. అనంతరం స్వామివారి కల్యాణోత్సవాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళలు వడిబియ్యం సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. స్వామివారిని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం దర్శించుకుని కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. దైనందిన జీవితంలో ఉరుకులు పరుగులతో కూడిన జీవనాన్ని గడుపుతున్నారని, కుటుంబ సభ్యులతో దేవాలయాన్ని సందర్శించి భగవంతుడిని దర్శించుకుంటే మానసిక ప్రశాంతతతో పాటుగా భక్తిభావం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయం చైర్మన్ నర్రా మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లు తెరిచి మూడు రోజులైనా

వార్డెన్లు లేరు



మోత్కూరు ఎస్సీ బాలికల హాస్టల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

మోత్కూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల వసతి గృహాలు తెరిచి మూడు రోజులైనా వార్డెన్లు, వర్కర్లు సక్రమంగా విధులకు హాజరు కావడం లేదు. బీసీ బాలికల హాస్టల్లో వార్డెన్ లేరు, విద్యార్థినులూ లేరు. కొన్నింటిలో విద్యార్థులు వచ్చిందీ 10మంది లోపే. ఆ వచ్చిన వారికీ వర్కర్లు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదు. మోత్కూరు మండల కేంద్రంలోని హాస్టళ్లను తహసీల్దార్ డి.రాంప్రసాద్, ఎంఈవో టి.గోపాల్‌రెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డి, కమిషనర్ సి.శ్రీకాంత్ గురువారం ఉదయం తనిఖీ చేయగా ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. బీసీ బాలుర హాస్టల్‌లో 65 మంది విద్యార్థులకు 10మంది పాఠశాల విద్యార్థులు, 10మంది కళాశాల విద్యార్థులకు ఇద్దరు వచ్చారు. హాస్టల్‌లో వార్డెన్ జ్యోతి అందుబాటులో లేరు. ఉన్న 10మంది విద్యార్థులకు ఉదయం 6గంటలకు ఇవ్వాల్సి రాగిజావ ఇవ్వలేదు. పాఠశాలకు వెళ్లే ముందు జీరారైస్ లేదా టమాట రైస్ ఇవ్వాల్సి ఉండగా, అన్నం వండి, చారు చేశారు. కొద్దిగా పప్పుకూర వండామని చెబుతున్నా, 10మంది విద్యార్థుల్లో చివరి వారికి దొరకనే లేదు. ఇదేంటని అధికారులు అడిగితే పప్పు అయిపోయిందని వర్కర్లు తెలిపారు. కళాశాల విద్యార్థులను ఉదయం తిని వెళ్లాక మళ్లీ రావొద్దని అంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎస్సీ బాలికల హాస్టల్‌లో సుమారు 100మంది విద్యార్థినులకు ఏడుగురు మాత్రమే వచ్చారు. అధికారులు వెళ్లే సరికి ముగ్గురు అమ్మాయిలు మాత్రమే ఉన్నారు. ఉదయం 6గంటలకు పాలతో రాగి మాల్ట్ ఇవ్వలేదన్నారు. పాఠశాలకు వెళ్లేప్పుడు టమాట రైస్ ఇచ్చారని విద్యార్థినులు తెలిపారు. వార్డెన్ లేరు. తహసీల్దార్ ఫోన్ చేసి అడగ్గా తనకు రామన్నపేట హాస్టల్ ఇన్‌చార్జి ఉందని, అక్కడకు వెళ్లానన్నారు. హాస్టల్‌లో ఐదుగురు వర్కర్లకు ఒక్కరే, అదీ ఒకరి బదులు మరొకరు ఉన్నారు. ట్యాంకు నిండి నీళ్లు వృథాగా పోతున్నా మోటారు ఆఫ్ చేసే నాథుడే లేడు. బాత్‌రూంల డోర్ రేకులు పగిలి అస్తవ్యస్తంగా ఉన్నాయి. దీంట్లో అమ్మాయిలు స్నానాలు ఎలా చేస్తారని మునిసిపల్ చైర్‌పర్సన్ కవిత ప్రశ్నించారు. బీసీ బాలికల హాస్టల్‌కు వెళ్లగా అక్కడ వార్డెన్, విద్యార్థినులు లేరు. హాస్టల్ తెరిచి మూడు రోజులైనా విద్యార్థినులు రాలేదని వర్కర్ అరుణ తెలిపారు. వార్డెన్ రాలేదా అని ఎంఈవో అడగ్గా నిన్న వచ్చారని, ఈ రోజు రాలేదని తెలిపారు. నిన్న కూడా రాలేదని ఎంఈవో అనగా, వచ్చారని, తనకు డబ్బు కూడా ఇచ్చిరని సమాధానం చెప్పారు. అయితే తనకు హైదరాబాద్‌లో కలిశారని, ఇక్కడికి ఎప్పుడు వచ్చారని, డబ్బు ఎలా ఇచ్చారని అడగ్గా ఫోన్‌పే చేసినట్టు తెలిపారు. వార్డెన్ జ్యోతి హాస్టల్‌కు రాకుండా వర్కర్‌తో అబద్ధం చెప్పిస్తునారని అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టళ్లలో గమనించిన విషయాలన్నింటినీ జిల్లా అధికారులకు నివేదిస్తామని తహసీల్దార్ రాంప్రసాద్, ఎంఈవో గోపాల్‌రెడ్డి తెలిపారు. మునిసిపల్ వైస్‌చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య వారి వెంట ఉన్నారు.

అన్నీ ఆటంకాలే

(మొదటి పేజీ తరువాయి)

మూసీ ప్రక్షాళన ప్రాజెక్టును కేంద్రం చేపట్టాలని డిమాండ్ చేస్తూ అప్పటి కేంద్ర జలవనరులశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు వినతిపత్రం అందజేశారు. నమామి గంగ తరహాలో మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు రూపొందించాలని, అందుకు కేంద్రం నిధులివ్వాలని ఆయన కోరారు. మూసీ ప్రక్షాళనను గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ప్రతిపాదించినా కేంద్రం కొర్రీలు వేసిందే తప్ప నిధులివ్వలేదని మాజీ ప్రజాప్రతినిధులు విమర్శిస్తున్నారు. తాజాగా, సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మూసీ ప్రక్షాళనకు కేంద్రమంత్రికి విన్నవించారు. కేంద్రం నిధుల విషయంలో ఏం హామీ ఇస్తుందో ఇంకా స్పష్టత రాలేదు. అయితే ఈ ప్రాజెక్టుకు కేంద్రం మద్దతు ఇస్తేనే ఆశించిన రీతిలో మూసీ ప్రక్షాళన ముందుకు సాగుతుందని, రైతుల విస్తృతస్థాయి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాజెక్టుకు కేంద్రం కూడా నిధులిచ్చేందుకు బీజేపీ నేతలు కృషి చేయాలనే సూచనలు వస్తున్నాయి.

రాజకీయ వివాదంలో తాజా ప్రాజెక్టు

అనివార్యంగా చేపట్టాల్సిన మూసీ ప్రక్షాళన కార్యక్రమం తరచూ రాజకీయ వివాదాల్లో చిక్కుకుంటోంది. ప్రస్తుతం మూసీ ప్రక్షాళనను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టగా, దాన్ని కొనసాగిస్తే రానున్న రెండు, మూడేళ్లలోనైనా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పరివాహక ప్రాంతానికి పట్టిన కాలుష్యపీడ విరగడవుతుందని రైతులు భావిస్తున్నారు. అయితే తాజా, ప్రాజెక్టులో మొదటి దశలో హైదరాబాద్ పరిధిలో మూసీ నదిలో బఫర్‌జోన్‌లో, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న ఆక్రమణలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టగా అది రాజకీయ వివాదంగా పరిణమించింది. ఆక్రమణల తొలగింపుతో పాటు, మూసీ నీటి ప్రక్షాళన కోసం ప్రభుత్వం మరో 39 ఎస్టీపీలను నిర్మించాలని తలపెట్టింది. అందుకోసం రూ.3,849కోట్ల నిధులు కేటాయించింది. అయితే తాజా, రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ ప్రాజెక్టు ఏమేరకు ముందుకు సాగుతుందనే సందిగ్ధం ఉమ్మడి జిల్లా వాసుల్లో నెలకొంది. ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు ఈసారి ఆటంకాలను పరిష్కరిస్తూ మూసీ ప్రక్షాళన చేపట్టాల్సిందేనని ఉమ్మడి జిల్లా మూసీ పరివాహక రైతాంగం కోరుతోంది.

కోటేశ్వర్ ముందు...

ఓడిపోతున్న వైకల్యం

క్రీడలంటే కోటేశ్వర్‌కు ఆసక్తి. స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడేవాడు. ఇందులో వింతేముంది అనుకుంటున్నారా?. పోలియోతో ఓ కాలు పూర్తిగా సహకరించకపోయినా మరో కాలి బలంతో ఆడేవాడు. స్నేహితుల ప్రోత్సాహంతో బై రన్నర్‌ను పెట్టుకుని బ్యాటింగ్ మాత్రమే చేసేవాడు. క్రీడలపై ఆసక్తిని చూసిన ఓ కోచ్ పలు క్రీడల్లో కోటేశ్వర్‌ను ప్రోత్సహించడంతో అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్నాడు. వీల్‌చైర్ క్రికెట్‌తో పాటు హ్యాండ్‌బాల్, బాస్కెట్ బాల్ విభాగాల్లో ప్రతిభ కనబరుస్తున్నాడు. 2020లో పారాఒలింపిక్స్ క్వాలిఫయర్ రౌండ్ వరకు వెళ్లాడు.

- పోలియోబారిన పడ్డా తగ్గని ఆసక్తి
- వీల్‌చైర్ బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, క్రికెట్‌లో సత్తా
- పారాఒలింపిక్స్‌లో పతకం సాధించడమే లక్ష్యం

(ఆంధ్రజ్యోతి- చందంపేట)

నల్లగొండ జిల్లా చందంపేట మండలం గన్నేర్లపల్లి పరిధి ధర్మతండాకు చెందిన తావూర్యానాయక్, భారతీ దంపతుల కుమార్తె ఇద్దరు కుమారుల్లో పెద్దవాడు కోటేశ్వర్. ఐదేళ్ల వయసులోనే పోలియో బారినపడి కుడికాలు బలం కోల్పోయింది. ప్రాథమిక విద్యతో పాటు ఇంటర్ వరకు దేవరకొండలో చదివాడు. క్రీడలంటే కోటేశ్వర్‌కు చాలాఆసక్తి. గమనించిన స్నేహితులు ఓదార్పు కోసం అతడికి బ్యాటింగ్ ఇచ్చేవారు. ఒంటికాలిపై నిలబడి బ్యాటింగ్‌లో ప్రతిభ కనబరిచేవాడు. ఈ క్రమంలో స్నేహితులు క్రికెట్ ఆడే ప్రతీ సందర్భంలోనూ అతడికి అవకాశం కల్పిస్తుండేవారు.

మలుపు తిప్పిన డిగ్రీ

కోటేశ్వర్ డిగ్రీ చేయడం కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. ఉస్మానియాలో పీజీ చేస్తున్న సమయంలోనే వీల్‌చైర్ క్రీడల్లో కోటేశ్వర్ ప్రతిభను కోచ్ సోహెల్‌ఖాన్ గమనించాడు. అతడికి బాసెట్‌బాల్, హ్యాండ్‌బాల్ పోటీల్లో శిక్షణ ఇచ్చాడు. క్రికెట్‌లోనూ కోటేశ్వర్ శిక్షణ పొందాడు. దీంతో రాష్ట్ర, జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు కోటేశ్వర్‌కు అవకాశం దక్కింది.

రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ..

రాష్ట్ర, జాతీయ స్థాయిలో 2018 నుంచి కోటేశ్వర్ వీల్‌చైర్ బాస్కెట్ బాల్, క్రికెట్‌లో రాణిస్తున్నారు. వివిధ టోర్నీల్లో జట్టు విజయానికి తోడ్పడ్డాడు. ప్రస్తుతం రాష్ట్రం తరుపున వీల్‌చైర్ క్రికెట్, బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా టీంకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇటీవల చెన్నైలో జరిగిన సౌత్‌జోన్ వీల్‌చైర్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లో తన కెప్టెన్సీ సారథ్యంలోనే జట్టు సిల్వర్ మెడల్ సాధించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన బెస్ట్ పారా స్పోర్ట్స్ పర్సన్ అవార్డును మంత్రి సీతక్క నుంచి కోటేశ్వర్ అందుకున్నారు. అతడి పట్టుదల ముందు కాలి వైకల్యం ఓడిపోతోంది. పట్టుదల, ఆత్మస్థైర్యంతో ఎన్నో విజయాలు సొంతం చేసుకుంటున్న కోటేశ్వర్ పారా అథ్లెట్స్‌లో స్ఫూర్తిని నింపుతున్నారు.



చెన్నైలో వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ టీంతో కోటేశ్వర్(రౌండప్‌లో)

- 2018, 2019లలో బాస్కెట్‌బాల్ జాతీయస్థాయి జట్టులో సభ్యుడు.
- 2020 పారాఒలింపిక్స్‌లో క్వాలిఫయింగ్ పోటీల్లో పాల్గొన్నప్పటికీ అవకాశం దక్కలేదు.
- 2022లో పోర్చుగల్‌లో జరిగిన వరల్డ్ సిక్స్ ఏ సైడ్ వీల్‌చైర్ హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ సాధించిన జట్టులో సభ్యుడు.
- 2022లో ఈజిప్ట్‌లో జరిగిన ఫోర్ ఏ సైడ్ విభాగంలో వరల్డ్ ఛాంపియన్ హ్యాండ్‌బాల్ టీంలో సభ్యుడు.
- 2022 సౌత్ జోన్‌స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో సిల్వర్‌మెడల్ సాధించిన జట్టులో సభ్యుడు.
- 2022లో జరిగిన ఇంటర్నేషనల్ బాస్కెట్‌బాల్ సిల్వర్ మెడల్ సాధించిన జట్టులో సభ్యుడు.
- 2023లో టీ-20 క్రికెట్ మనాస్ ఇండో, బంగ్లా ఫ్రెండిషిప్ కప్‌లో ఇండియా తరపున ఆడాడు.
- ఈ ఏడాది నేపాల్ రాజధాని ఖాట్మండులో జరిగిన వీల్‌చైర్ క్రికెట్ పోటీల్లోనూ పాల్గొన్నాడు.



పారాఒలింపిక్స్ పతకమే లక్ష్యం



పారాఒలింపిక్స్‌లో దేశం తరుపున ఆడాలన్నదే నా లక్ష్యం. నాకు ప్రోత్సాహం అందించేందుకు అడ్వాన్స్ టెక్నాలజీ కలిగిన ఒక వీల్‌చైర్ అవసరం. దాతలు కాని, ప్రభుత్వం కానీ అందజేస్తే మరింత ప్రోత్సాహంతో ఆడతా. దేశానికి పారాఒలింపిక్స్‌లో పతకం తేవాలన్నది నా ఆకాంక్ష. అందుకు సహకరించాలి.

- కోటేశ్వర్, పారా అథ్లెట్

అందుకే అలాచేశా..

- రెవెన్యూ, మున్సిపల్ స్థలాల రిజిస్ట్రేషన్లపై పోలీసుల విచారణ
- ముగిసిన తహసీల్దార్ జయశ్రీ పోలీస్ కస్టడి
- సబ్‌జైలుకు తరలించిన పోలీసులు
- హైకోర్టులో బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేసిన తహసీల్దార్

హుజూర్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలో ప్రభుత్వ భూముల పట్టాల మార్పిడి ఘటనల్లో అరెస్టయిన తహసీల్దార్ వజ్రాల జయశ్రీ, ధరణి ఆపరేటర్ జగదీష్ పోలీస్ కస్టడీ గురువారంతో ముగిసింది. అయితే గత ప్రభుత్వంలోని కొందరు ప్రభుత్వ పెద్దల ఒత్తిడితోనే ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్ చేసినట్టు పోలీసుల విచారణలో తహసీల్దార్ వివరించినట్టు సమాచారం.

హుజూర్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో సీఐ చరమందరాజు, ఇతర ఉన్నతాధికారులు వారిని విచారించారు. ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం వరకు సుమారు 4.30గంటల పాటు తహసీల్దార్‌ను పోలీసులు విచారించారు. గరిడేపల్లి, నేరేడుచర్ల మండలాల్లో సుమారు ఆరేళ్లపాటు తహసీల్దార్‌గా పనిచేసిన జయశ్రీ హయాంలో జరిగిన భూముల రిజిస్ట్రేషన్ల విషయాన్ని పోలీసులు ప్రత్యేకంగా విచారించినట్టు సమాచారం. రైతుబంధు డబ్బు ఎలా ఖర్చు చేశారని పోలీసులు ప్రశ్నించినట్టు సమాచారం. కాగా, తహసీల్దార్ భర్త ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా, ఆయనతో పాటు ఆమె కుటుంబ సభ్యులు, బంధువులకు సంబంధించి కూడా పోలీసులు విచారించినట్లు తెలిసింది. కుటుంబ సభ్యుల ఆస్తుల వివరాలకు సంబంధించి ఆరా తీసినట్లు సమాచారం. కాగా కొన్ని ప్రశ్నలకు ఎలాంటి సమాధానాలు చెప్పకపోవడంతో వాటికి సంబంధించిన ఆధారాలను చూపి పోలీసులు విచారణ చేసినట్లు తెలిసింది. మూడురోజుల విచారణలో గత ప్రభుత్వంలోని ప్రముఖుల ఒత్తిడి మేరకు కొన్ని రిజిస్ట్రేషన్లు చేసినట్టు తహసీల్దార్ వెల్లడించినట్లు సమాచారం.

హుజూర్‌నగర్ మునిసిపాలిటీలో లేఅవుట్ స్థలాలు, రెవెన్యూ స్థలాల రిజిస్ట్రేషన్ల ఘటనలపైనా పోలీసులు విచారణ చేసినట్టు తెలిసింది. పట్టణంలోని మునిసిపల్ పరిధిలో సుమారు 60వేల గజాల లేఅవుట్ స్థలాలు ఉన్నాయి. మూడేళ్లలో అప్పటి ప్రభుత్వ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా వీటిని రిజిస్ట్రేషన్ చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. రూ.100కోట్లకు పైగా విలువచేసే ప్రభుత్వ భూములతో పాటుగా ప్రైవేట్ వ్యక్తుల పేర్లతో ఉన్న ప్లాట్లను కూడా కుంటల్లో రిజిస్ట్రేషన్లు చేసినట్టు విమర్శలు ఉన్నాయి. పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొంతమంది వ్యక్తులు, వివిధ పదవుల్లో ఉన్న నాయకుల పేరున మునిసిపల్, రెవెన్యూ స్థలాలను తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారు. సాయిబాబా థియేటర్ రోడ్డు, రామస్వామి గట్టుకు వెళ్లే దారిలో కొన్ని లేఅవుట్ స్థలాలు, లక్కవరం రోడ్డు, లింగగిరి రోడ్డు, చింతలబజారు రోడ్డు, శ్రీనగర్‌కాలనీ రోడ్డు, మిర్యాలగూడ రోడ్డు, కోదాడ రోడ్డులోని పరిసర ప్రాంతాల్లో వందల ఎకరాల ప్రభుత్వ భూములు ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తమయ్యాయి. వీటితో పాటు చెరువు శిఖం భూములు సైతం రిజిస్ట్రేషన్లు చేశారు. గత ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించిన ముఖ్యనేతలు వీటి వెనుక సూత్రధారులుగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో విచారణ మొత్తం హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ భూములపైనే పోలీసులు దృష్టి సారించినట్టు తెలుస్తోంది.

పట్టణంలోని ఫణిగిరి గట్టు వద్ద జర్నలిస్టులకు ఇచ్చిన ఇళ్ల స్థలాలపైనా తహసీల్దార్‌ను విచారించినట్లు తెలిసింది. జర్నలిస్టుతోపాటు అసలు పత్రికల్లో పనిచేయని వారికి, అదేవిధంగా నల్లగొండ, హైదరాబాద్ లాంటి ప్రాంతాల్లో ఉన్న వ్యక్తులకు పట్టాలు జారీచేసిన అంశంపై విచారణ జరిగినట్లు తెలిసింది. గత ఏడాది ఫణిగిరిగట్టు వద్ద సుమారు 100 మందికి పైగా జర్నలిస్టులకు పట్టాలు జారీచేశారు. వారే కాకుండా రెవెన్యూ కార్యాలయాలలో పనిచేసే వ్యక్తులు, వివిధ హోదాల్లోని వారికి కూడా పట్టాలు మంజూరయ్యాయి. ఓ ప్రజాప్రతినిధికి బంధువు ఇళ్ల పట్టాలు మంజూరు చేయించినట్టు గతంలో ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో పోలీస్ కస్టడీలో ఉన్న తహసీల్దార్‌ను వీటిపై విచారించినట్టు సమాచారం.

మొత్తంగా మూడురోజుల విచారణ అనంతరం గురువారం సాయంత్రం 4.30 గంటలకు కస్టడీ ముగియడంతో తహసీల్దార్‌ను హుజూర్‌నగర్ సబ్‌జైలుకు తరలించారు. ఇద్దరు మహిళా అధికారులు, మరో ఇద్దరు మహిళా పోలీసుల సమక్షంలో విచారణ సాగింది. విచారణ మొత్తం వీడియో తీశారు. తహసీల్దార్ జయశ్రీ ఈ నెల 9న అరెస్ట్ కాగా, కోర్టు 14 రోజులపాటు రిమాండ్ విధించింది. ఈ నెల 10న మొదటిసారి ఆమెను కోర్టు అనుమతితో పోలీసులు కస్టడీలోకి తీసుకుని ఒక రోజు విచారించారు. అనంతరం మళ్లీ ఈ నెల 14న కోర్టు అనుమతి తీసుకుని 15, 16, 17 తేదీల్లో మూడురోజుల పాటు పోలీసు కస్టడీలో విచారించారు. మొత్తం నాలుగురోజుల పాటు విచారించిన పోలీసులు తిరిగి 17వ తేదీ సాయంత్రం ఆమెను హుజూర్‌నగర్ సబ్‌జైలుకు తరలించారు. ఇదిలా ఉండగా గురువారం హైకోర్టులో తహసీల్దార్ బెయిల్ పిటిషన్ వేయగా, అది వాయిదా పడినట్టు పోలీసులు తెలిపారు.

నకిలీల మాయాజాలం



మార్కెట్‌లో లభిస్తున్న వాటిలో అసలేదో, నకిలీ ఏదో తెలుసుకోలేని పరిస్థితి దాపురించింది. దేశాని కి వెన్నముకగా ఉన్న వ్యవసాయ రంగం నేడు నకిలీల ముప్పును ఎదుర్కొంటోంది. పంటల సాగులో ప్రధాన భూమిక పోషించే రసాయన మందులపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో మార్కెట్లో నకిలీ మందులు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. ఈ డుబ్లికేట్ దందా చేస్తున్న వ్యాపారులు లాభాలు గడిస్తుంటే, పంట సాగులో నిరంతరం శ్రమిస్తున్న రైతులు ఆర్థికంగా ఆర్థికంగా చితికిపోతున్నారు.

- ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ(వ్యవసాయం)

- పుట్టగొడుగుల్లా మార్కెట్లోకి
- బయోలతో పంటలకు ముప్పు
- ఏటా రూ.కోట్లలో దందా
- నష్టపోతున్న అన్నదాతలు

పట్టించుకోని ప్రభుత్వాలు

మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఖరీదైన మందు ల పేరుతో నకిలీ మందులు రాజ్యమేలుతున్నా యి. లీటర్ రెండు వేల నుంచి ఆపై ధరలు ఉన్న రసాయన మందుల కంపెనీ లేబుళ్లు, డబ్బాలతో సహా నకిలీలను తయారు చేస్తున్నారు. అసలు, నకిలీలను గుర్తించే బార్‌కోడ్‌లను కూడా గుర్తించలేనంతగా మార్చి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. దీంతో సాధారణ రైతులు వీటిని గుర్తించే అవకా శం లేదు. రెండు రోజుల కిందట నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో ఓ పెస్టిసైడ్ దుకాణంలో ప్రముఖ కంపెనీల పేరుతో ఉన్న నకిలీ దోమ మందులను ఓ రైతు కొనుగోలు చేశాడు. ఆ మందుపై అనుమానంతో కంపెనీ ప్రతినిధుల ను సంప్రదించాడు. వారు అవి నకిలీవని తేల్చి అధికారులకు ఫిర్యాదు చేశారు.

తక్కువ ధరకు విక్రయిస్తూ

ప్రధాన కంపెనీ మందు ధర రూ.5 వేలు ఉండగా నకిలీ మందులు రూ.4 వేలకు విక్రయిస్తున్నారు. తక్కువ ధర వస్తుందనే ఆలోచనతో రైతులు కొనుగోలు చేస్తున్నారు. ప్రధాన కంపెనీల మందులు విక్రయిస్తే దుకాణదారులకు మిగులు పాటు నామమాత్రంగా ఉంటుంది. నకిలీలు విక్రయిస్తే 50 శాతం లాభం ఉంటుంది. దీంతో చాలామంది వ్యాపారులు ఏళ్ల తరబడి నకిలీల విక్రయాలకు చేపడుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అతిపెద్ద మార్కెట్ అయిన మిర్యాలగూడ పట్టణంతో పాటు సాగర్ నియోజకవర్గం, హుజూర్‌నగర్, కోదాడ ప్రాంతాల్లో వ్యాపారులు నకిలీల మాయాజాలం ప్రదర్శిస్తున్నారు.

సరిహద్దులో ఉండటంతో..

నకిలీ మందులు గుంటూరు కేంద్రంగా తయారు చేస్తున్నట్లుగా రైతులు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని మిర్యాలగూడ, నాగార్జునసాగర్, హుజూర్‌నగర్ నియోజకవర్గాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సరిహద్దుల్లో ఉంటాయి. దీంతో అక్కడి నుంచే అన్నిరకాల నకిలీ మందులు దిగుమతి చేసుకుంటున్నట్లు సమాచారం. ఈ ప్రాంతంలో లక్షలాది ఎకరాలో పంటల సాగు ఉండటం వ్యాపారులకు వరంగా మారింది. ఏళ్ల తరబడి నకిలీల దందా సాగిస్తూ రూ.కోట్లు కొల్లగొడుతు అన్నదాతలను ఆర్థికంగా నష్టపరుస్తున్నారు. అయినప్పటికీ వ్యాపారులను అడ్డుకునే వారే కరవయ్యారు. రైతులు గుర్తించి కంపెనీల ప్రతినిధులకు ఫిర్యాదు చేస్తే తప్ప నకిలీలపై వ్యవసాయాధికారుల పర్యవేక్షణ కరువైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బయో మందులకు అడ్డేలేదు

నకిలీ మందుల తరువాత ప్రధానంగా మార్కెట్‌ను శాసించేది బయో మందులు. వందలాది కంపెనీలు బయో మందులు పేరుతో మాయాజా లం ప్రదర్శిస్తున్నాయి. సాధారణంగా రసాయనా లు లేకుండా కేవలం పర్యావరణానికి ఎటువంటి హాని కలిగించని సహజ సిద్ధమైన వాటి నుంచే(సముద్రపు నాచు తదితరాలు) ఈ బయో మందులు తయారు చేయాలి. కానీ, మార్కెట్లోకి లభించే మందులు మాత్రం పూర్తిగా ప్రమాదకర రసాయనాలు మిళితం చేసినవి వస్తున్నాయి. డబ్బాలపై మాత్రం అందమైన రంగులతో తీర్చిదిద్ది ఉంటాయి. అసలు రసాయనికి కంపెనీల కన్నా ఈ బయో మందులు తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. వాస్తవంగా బయో మందులు తయారు వ్యవహారం చాలా ఖరీదైంది. కానీ చాలా తక్కువ ధరకు ఏవిధంగా విక్రయిస్తున్నారో వ్యాపారులు కూడా చెప్పలేకపోతున్నారు. పెద్ద రసాయనిక కంపెనీల్లో కాలం పూర్తయిన రసాయనాలను వేలం పాట వేస్తుంటారు.. ఈ బయో కంపెనీలు ఆ సరుకును తక్కువకు కొనుగోలు చేసి బయోమందులు తయారు చేస్తుంటారని వ్యవసాయ నిపుణులు చెపుతున్నారు.

ఈ బయో మందులు ప్రతీ పెస్టిసైడ్ దుకాణంలో విరివిరిగా లభిస్తుంటాయి. ఎక్కువ లాభా లు వస్తుండటంతో వీటినే ఎక్కువగా విక్రయిస్తుంటారు. దీంతో పాటు వ్యాపారులకు కంపెనీలు ఆఫర్లు ఇస్తుంటాయి. ఒకటి కొంటే మరొకటి ఉచి తం. ధరలో సగం మిగులు ఉండటంతో పాటు విదేశీ పర్యటనకు తీసుకెళ్తుంటాయి. దీంతో వ్యా పారులు వీటినే ఎక్కువగా విక్రయించేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. మార్కెట్‌లో బయోలకు డిమాండ్ ఉండేలా వ్యాపారులు ప్రచారం కల్పిస్తుండటమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

పర్యవేక్షణ కరువు

మార్కెట్లో నకిలీ పురుగుమందులు దందా సాగుతున్నా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందని రైతులు మండిపడుతున్నారు. నకిలీలు ఎక్కడైనా పట్టుబడితే తప్ప దుకాణాలపై అధికారుల నిరంతర పర్యవేక్షణ కరువైందంటున్నారు. నకిలీ, బయయోలతో రైతులు దగాపడుతున్నా పట్టించుకోవడం లేదంటున్నారు. ప్రభుత్వం నకిలీలు, బయో మందులపై పూర్తిస్థాయిలో నిఘా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పంటలకు తీవ్ర నష్టం

నకిలీ, బయో మందుల పిచికారీతో పంటలతో పాటు పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. నకిలీ మందులు పిచికారీ చేయడం వల్ల అవి పనిచేయక పోగా పంటలు దెబ్బ తింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బయో మందులు వాడకంతో పంట తాత్కాలికంగా పచ్చగా అందంగా మారుతుంది, కారణం వాటిలో కలిపే నైట్రోబెంజియట్, జిబ్బరిల్లిక్‌యాసిడ్ అని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. అయితే పంటలో కొద్ది రోజులకే రోగనిరోధక శక్తి తగ్గి తెగుళ్ల ప్రభావం అధికమవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దిగుబడులు తగ్గడంతో పాటు గింజ నాణ్యతలోనూ లోపాలు ఉంటాయన్నారు.


నకిలీ పురుగుమందులు స్వాధీనం

- తనిఖీలో బయటపడ్డ వ్యాపారుల దందా
- వీర్లపాలెంలో ఆగ్రోస్‌రైతుసేవా ఫర్టిలైజర్ దుకాణం సీజ్
- మిర్యాలగూడలో ఇద్దరు డీలర్ల లైసెన్స్ రద్దు
- వాడపల్లి పోలీసులకు వ్యవసాయాధికారుల ఫిర్యాదు

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నకిలీ పురుగుమందులతో రైతులను దగా చేస్తున్న వ్యవహారంపై అధికారులు స్పందించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ డివిజన్ పరిధిలో గుట్టుగా సాగిపోతున్న నకిలీ ఫర్టిలైజర్స్ దందాను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. దీనిపై వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు స్పందించారు. దీంతో గురువారం జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్ మిర్యాలగూడ ఏడీఏ దేవ్‌సింగ్‌తో కలిసి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మిర్యాలగూడ పట్టణంలోని ఏచూరి శ్రీనివాసరావు ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్‌లో జరిపిన తనిఖీలో సింజెంటా కంపెనీ పేరు కలిగిన రూ.53వేల విలువైన నకిలీ చెస్, పురుగుమందులను గుర్తిం చి సీజ్ చేసినట్లు డీఏవో తెలిపారు. మిర్యాలగూడలో పట్టుబడ్డ నకిలీమందులపై ఆరాతీయగా దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామానికి చెందిన డీలర్ సజ్జల రాజిరెడ్డి సరఫరా చేసినట్లు గుర్తించామన్నారు. మిర్యాలగూడ కు చెందిన రాజశేఖర్‌రెడ్డి, రమేష్‌బాబు అనే వ్యాపారులు ఇచ్చిన సమాచా రం మేరకు వీర్లపాలెం గ్రామంలోని ఆగ్రోస్‌రైతు సేవా కేంద్రంలో తనిఖీలు జరపగా సుమారు రూ.1.50లక్షల విలువైన నకిలీ చెస్‌మందు డబ్బాలు లభ్యమైనట్లు అధికారులు తెలిపారు. పట్టుబడ్డ మందులను స్వాధీనం చేసుకుని షాప్‌ను సీజ్‌చేసి, డీలరు రాజిరెడ్డి లైసెన్స్ రద్దు చేసినట్లు జేడీఏ తెలిపారు. అదేవిధంగా మిర్యాలగూడకు చెందిన ఏచూరి శ్రీనివాసరావు, రాజశేఖర్‌రెడ్డి అనే డీలర్ల లైసెన్స్‌లను కూడా అధికారులు రద్దుచేశారు. అయితే నకిలీ చెస్‌మందును గుంటూరు జిల్లా నుంచి సరఫరా చేస్తున్న ధనావత్ రమేష్, గుట్టుగా విక్రయిస్తున్న డీలరు రాజిరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ వాడపల్లిపోలీసులకు ఫిర్యాదుచేసినట్లు జేడీఏ తెలిపారు. తనిఖీలో ఏవోలు డీ సైదానాయక్, సరిత పాల్గొన్నారు.



దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామంలోని ఆగ్రోస్‌రైతుసేవా కేంద్రంలో నకిలీ మందులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



నల్లగొండ జిల్లా కేంద్రంలోని బ్రహ్మంగారి గుట్ట పైనుంచి గురువారం కనిపిస్తున్న సుందర దృశ్యం

వర్షించే మేఘం హర్షించే రాగం

నైరుతీ రుతుపవనాలు ముగిసి చలికాలం తరుముకొస్తోంది.. ఉదయాన్నే సూరీడు సైతం ఆలస్యంగా మేలు కొంటున్నాడు.. తామింకా వెళ్లలేదన్నట్లుగా మేఘాలు విహరిస్తూ కనిపిస్తున్నాయి. మేమున్నామంటూ వాటి వెంటే చల్లని గాలులు వస్తున్నాయి. వారం రోజులుగా ఈ వాతావరణం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కనిపిస్తోంది. అక్కడక్కడా చిరుజల్లులు కురుస్తున్నాయి. కోతకొచ్చిన పంట చేల మీదుగా వెళ్తున్న మేఘాలు చూపులను తిప్పుకోలేనంతగా ప్రకృతికి అందాన్ని చేకూరుస్తు న్నాయి. ఆహ్లాదకర వాతావరణంలో పంట చేలల్లో కూలీలు, రైతులు పనులు చేసుకుంటూనే ఎక్కడ వర్షిస్తాడో అన్న భయంతో అటుగా వెళ్తున్న మేఘాలను ఓ కంట కనిపెడుతూనే ఉన్నారు. (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)



యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలకేంద్రం సమీపంలో పచ్చని పొలాల మీదుగా మేఘాలు

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	590.00
టీఎంసీలు	312.0450
ఎడమకాల్వకు నీటి విడుదల	6,173
కుడికాల్వకు	8,067
విద్యుత్ కేంద్రం ద్వారా	29,557
సాగర్‌కు నీటి రాక	67,637
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	78,997 క్యూసెక్కులు

- నాగార్జునసాగర్, (ఆంధ్రజ్యోతి)

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	44.33 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	58,535
నీటి విడుదల	57,596

- మేళ్లచెర్వు,(ఆంధ్రజ్యోతి)

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.30 అడుగులు
టీఎంసీలు	4.28
ఇన్‌ఫ్లో	1390.26 క్యూసెక్కులు
ఔట్‌ఫ్లో	771.72 క్యూసెక్కులు

- కేతేపల్లి,(ఆంధ్రజ్యోతి)

శాలిగౌరారం

పూర్తి స్థాయి నీటిమట్టం	21 అడుగులు
ప్రస్తుత నీటిమట్టం	19 అడుగులు

- శాలిగౌరారం,(ఆంధ్రజ్యోతి)

డిండి

పూర్తి స్థాయి నీటిమట్టం	36 అడుగులు
టీఎంసీలు	2.4
ప్రస్తుత నీటిమట్టం	36 అడుగులు
ఇన్‌ఫ్లో	3750 క్యూసెక్కులు
ఔట్‌ఫ్లో	3750 క్యూసెక్కులు

-డిండి,(ఆంధ్రజ్యోతి)

ముల్కలపల్లి ఘటనపై పోలీసుల చర్యలు

● కానిస్టేబుల్ సత్యనారాయణ సస్పెన్షన్ ● సీఐ ధనుంజయ్‌కు చార్జి మెమో

గుర్రంపోడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని ముల్కలపల్లిలో సంచలనం సృష్టించిన వివాహిత హత్య కేసును ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించిన పోలీసు అధికారులపై సస్పెన్షన్ వేటు, చార్జి మెమోలు జారీ అయ్యాయి. మండలంలోని ముల్కపల్లి గ్రామానికి చెందిన జాల రజిత(30) అనే వివాహిత ఆగస్టు 29న హత్యకు గురైంది. సమాచారం మేరకు అక్కడ చేరుకున్న పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. భర్త దుర్గయ్య ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన జాల రాములును అరెస్టు చేశారు. కాని ఈ కేసులో ప్రమేయమున్న జాల రాములు, భార్య పార్వతమ్మ, ఆయన అన్న కుమారుడు వెంకటయ్యను తప్పించేందుకు భారీగా ముడుపులు తీసుకున్నారని ఆరోపణలు వచ్చాయి. ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఏఎస్పీ రాములునాయక్ ఆధ్వర్యంలో విచారణ జరిపించారు. పోలీసు కానిస్టేబుల్ సత్యనారాయణ ద్వారా ఎస్ఐ వేమిరెడ్డి నారాయణరెడ్డి రూ.లక్ష లంచం తీసుకొని అవినీతికి పాల్పడినట్లు తేలడంతో ఎస్పీ నివేదిక మేరకు మల్టీ జోన్-2 ఐటీసీ సత్యనారాయణ, ఎస్ఐ వేమిరెడ్డి నారాయణరెడ్డిని సస్పెండ్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సంఘటనలో ప్రమేయమున్నకానిస్టేబుల్ సత్యనారాయణను సస్పెండ్ చేస్తూ ఎస్పీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కొండమల్లేపల్లి సీఐ ధనుంజయగౌడ్‌కు చార్జి మెమో జారీ చేశారు.

మతిస్థిమితం లేని వ్యక్తి కాల్వలో దూకి ఆత్మహత్య



గోపికిషోర్‌మృతదేహం

త్రిపురారం ఆక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేనివ్యక్తి కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా త్రిపురారం మండలంలోని గంటారావుక్యాంపులో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం పట్టణంలోని సాయిగణేష్‌నగర్‌కు చెందిన కన్నెగంటి గోపికిషోర్(57) నాలుగు సంవత్సరాల నుంచి మానసిక ఆరోగ్య పరిస్థితి బాగాలేక పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తుండడంతో కుటుంబసభ్యులు ఖమ్మంలోని ఆస్పత్రిలో చూపించారు. కొన్ని రోజులు మంచిగా ఉండేవాడు. తర్వాత కొన్ని రోజులు ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేవాడు. ఈ నెల 12వ తేదీన తన ఇంటి నుంచి వెళ్లాడని గురువారం ఉదయం సుమారు 7గంటల సమయంలో గంటారావుక్యాంపు వద్ద ఉన్న ఉన్న ముదిమాణిక్యం మేజర్ కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని గోపికిషోర్ కుమారుడు హరిదీప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గోపి కిషోర్‌కు భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉంది.

అనుమానాస్పదస్థితిలో బాలుడు మృతి



దత్తు(ఫైల్)

పెద్దఅడిశర్లపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని బాలుడు అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన సంఘటన నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలం మూనావత్ తండాలో గురువారం జరిగింది. గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన మూనావత్ మోహన్-లీలా దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. మొదటి వాడైనా మూనావత్ దత్తు(12) హైదరాబాద్‌లోని హాస్టల్‌లో ఉంటూ 7వ తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులు రావడంతో ఇంటికి వచ్చారు. సెలవులు ముగియడంతో బుధవారం హైదరాబాద్‌కు బయలుదేరాల్సి ఉండగా వ్యవసాయ పనులు ఉండడంతో తండ్రి మోహన్ గురువారం వెళ్లామని అని చెప్పడంతో ఆగిపోయాడు. బుధవారం వ్యవసాయ బావి వద్ద దత్తు తాతతో పాలి వారు అయిన మునావత్ బెల్లు అతని కుమారులు ఘర్షణ పడ్డారు. అదే రోజు సాయంత్రం మోహన్ కుమారుడు దత్తు ఇంట్లో ఎవరూ లేని సమయంలో కిటికీకి ఉరివేసుకుని అనుమానాస్పదస్థితిలో మృతిచెంది విగతజీవిగా పడి ఉన్నాడు. దీంతో కుటుంబ సభ్యులు, స్థానికులు గుడిపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రాత్రి పొద్దుపోవడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఎలాంటి ఆవాంఛనీయ సంఘ టనలు జరగకుండా బందోబస్తును ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం కొండమల్లేపల్లి సీఐ ధనంజ య్యగౌడ్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేప ట్టారు. అనంతరం కుటుంబసభ్యులతో మాట్లాడి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ మార్చురీకి తరలించారు. హత్యా ?, ఆత్మహత్యా? నిర్ధారించేందుకు మృతదేహాన్ని నల్లగొండ మెడికల్ కాలేజీకి తరలించారు. అక్కడ పోస్టు మార్టం పూర్తిచేసి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. తన కొడుకు మృతిపై తన పాలివారు అయిన మూనావత్ బెల్లు, అతని కుమారులపై అనుమానం ఉందని మోహన్ తెలిపారు. కొద్ది రోజులుగా భూమి పంచాయితీ జరుగుతోందని, వారే చంపేసి ఉంటారని తండ్రి మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపారు.

రైలుకు ఎదురెళ్లి..



శ్రవన్‌కుమార్ (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): క్రిమిసంహారక మందుసేవించిన తర్వాత రైలుకు ఎదురుగా వెళ్లి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం వెలుగులోకి వచ్చింది. రైల్వే ఎస్ఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ- కొండ్రపోల్ రైల్వేమార్గంలో 115/8 మైలురాయి వద్ద రైలు పట్టాలపై గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, మృతుడి ఆచూకీ కోసం ప్రయత్నించామని తెలిపారు. సంఘటన జరిగిన పరిసరాల్లో గాలింపు చర్యలు చేపట్టగా రైల్వేస్టేషన్ హోం సిగ్నల్ వద్ద లభ్యమైన కాలేజీ బ్యాగులో ఐడీకార్డు ఆధారంగా మృతుడి వివరాలు తెలిసుకున్నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు. ఆత్మహత్యకు పాల్పడ్డ యువకుడు త్రిపురారం మండలం అల్వాలపాడు గ్రామానికి చెందిన చిర్ర శ్రవన్‌కుమార్ (18)గా నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. కాగా చిర్ర మల్లయ్య రెండో కుమారుడైన శ్రవన్‌కుమార్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. దసరా సెలవులకు ఇంటికి వచ్చిన శ్రవన్‌కుమార్ కాలేజీ హాస్టల్‌కు వెళ్తున్నట్లు తల్లిదండ్రులతో చెప్పి బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకొచ్చాడు. గురువారం రాత్రి గుర్తు తెలియని రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వేపోలీసులు తెలిపారు. మృతదేహం పక్కన క్రిమిసంహారక మందుడబ్బా పడి ఉందని, అందులోని మందును సేవించి రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు అభిప్రాయపడుతు న్నారు. ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం పూర్తిచేసి బంధువులకు అప్పగించి, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దివ్యక్షేత్రంలో నిత్య కైంకర్యాలు గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ అష్టభుజి ప్రాకారమండపంలో ఉత్సవమూర్తులను గజవాహన సేవలో తీర్చిదిద్ది సేవోత్సవం చేపట్టారు. అనంతరం కల్యాణతంతు కొనసాగింది. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని రామ లింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 13,23604 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, స్వామివారి దివ్యవిమాన రాజగోపురం బంగారు తాపడానికి హైదరాబాద్‌లోని సైదాబాద్‌కు చెందిన కంకర్ సుధీర్‌రెడ్డి రూ.10,00,116 విరాళం ఈవోకు అందజేశారు.

కొండపైన కొత్త షెడ్డు నిర్మాణం

స్వామివారి ఆలయంలో దూర ప్రాంతాల నుంచి వచ్చే దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేకంగా షెడ్డు నిర్మిస్తున్నారు. ప్రోటోకాల్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో వీఐపీ పార్కింగ్ ప్రదేశానికి ఎదురుగా 80/11 ఫీట్ల విస్తీర్ణంలో సుమారు రూ.5లక్షలతో చేపట్టిన పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. అయితే ఆ రోడ్డుపై పూర్తిగా షెడ్డు నిర్మిస్తే రెండు వేల మంది భక్తులకు ఎండా, వాన నుంచి రక్షణగా ఉంటుందని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రాన్ని కాపాడుకుందాం: సుమన్



ఆశీర్వచన మండపంలో నటుడు సుమన్, ఆయన కుమార్తె ప్రత్యూష

యాదగిరిగుట్ట ఆలయంలో లోపలికి వెళ్తే ఆధ్యాత్మిక ప్రపంచంలోకి వెళ్లినట్లు ఉం టుంది.. ఇంత అద్భుతమైన గుడిని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని సినీ నటుడు సుమన్ పిలుపునిచ్చారు. గురువారం ప్రధానాలయంలో లక్ష్మీనృసింహుడిని కుమార్తె ప్రత్యూష, బంధువులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆయనకు వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా సుమన్ తిరువీధుల్లో విలేకరులతో మాట్లాడుతూ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిసరాల్లో పరిశుభ్రతను కాపాడుకుందామన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఆలయాన్ని అద్భుతంగా నిర్మించారని, అందుకు అనుగుణంగా ఇక్కడి అధికారులు కూడా పరిశుభ్రతను పాటిస్తున్నారన్నారు. దేశం గర్వించేలా కాకతీయుల శిల్పాకళా సంపదకు ఏమాత్రం తీసిపోకుండా నిర్మించడం ఆనందకరమన్నారు. నిర్మాణంలో ఉన్నప్పుడు క్షేత్ర సందర్శనకు వచ్చానని, ఇప్పుడు స్వామిని దర్శించుకునేందుకు అవకాశం లభించిందన్నారు. ఆలయం లోపలికి వెళ్లేటప్పుడే సమస్యలను మరిచి భక్తి భావం కలిగి ఆధ్యాత్మిక లోకంలోకి అడుగు పెడుతున్న అనుభూతిని ప్రతి భక్తుడు పొందుతున్నాడని అన్నారు.

సందడిగా లతీఫుల్లా ఉర్సు

నల్లగొండ జిల్లా కేంద్రంలో లతీఫుల్లా షాఖాద్రీ ఉర్సు ప్రారంభమైంది. కులమతాలకు అతీతంగా ఈ ఉర్సులో పాల్గొంటుంటారు. దక్షిణ భారతదేశంలోనే గుట్టపై ఉన్న ఏకైక దర్గాగా లతీఫుల్లా ఖాద్రీ దర్గా ప్రసిద్ధి. గురువారం రాత్రి జరిగిన కార్యక్రమాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. దీంతో గుట్ట చుట్టుపక్కల ప్రాంతం సందడిగా కనిపించింది. క్లాక్‌టవర్ సెంటర్ నుంచి పాతబస్తీ వైపుగా వెలిసిన దుకాణాల్లో భక్తులు పలు వస్తువులను కొనుగోలు చేశారు. గంధం ఊరేగింపు సందర్భంగా కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది.



ఉర్సు సందర్భంగా లతీఫ్ గుట్ట వద్ద సందడి



గంధాన్ని మోసుకెళ్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి





గంధం ఊరేగింపులో పాల్గొన్న డప్పు వాయిద్య కళాకారులు, సమాధి వద్ద భక్తులు

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



సభ్యత్వాలు అందజేస్తున్న నాయకులు

చిట్యాల, చిట్యాలరూరల్, అక్టోబరు17, (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూటీఎస్ కృషిచేస్తుందని సంఘం జిల్లా అధ్యక్షుడు డీఏఎస్ ఫణికుమార్, మాజీ అధ్యక్షుడు సుంకరి బిక్షంగౌడ్ అన్నారు. చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెలిమినేడులోని పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదులో మాట్లాడారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ అభ్యర్థి పింగిళి శ్రీపాల్ రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కంచరకుంట్ల సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోమటిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పి. వెంకట్రావు, సీహెచ్ అజిత, ఎన్. సైదులు, బాదం బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం



బాధ్యతలు చేపడుతున్న సత్యం

నిడమనూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా తమ పాలకవర్గం పనిచేస్తుందని నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. మార్కెట్ కార్యాలయంలో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. త్వరలో మొదటి పాలకవర్గ సమావేశం నిర్వహించి మార్కెట్ పరిధిలో చేపట్టాల్సిన పనుల గురించి చర్చిస్తామన్నారు. రైతుల సహకారంతో మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి తోట చందర్ రావు, ఉన్నం చినవీరయ్య, మేరెడ్డి వెంకటరమణ, పగిళ్ల శివ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను వెంటనే చేపట్టాలి

హాలియా, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను తక్షణమే చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రాక్షి నర్సింహ డిమాండ్‌చేశారు. అనుముల మండలం పంగవానికుంటలో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సమగ్ర కుటుంబ సర్వే నిర్వహిస్తున్నందుకు, ఎస్సీ వర్గీకరణకు ఏకసభ్య కమిషన్‌ను నియమించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ సమగ్ర కుటుంబ సర్వే జరిగిన తర్వాతే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీల రిజర్వేషన్ ప్రకారంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెలుగు శంకర్, వెలుగు నాగరాజు, బుచ్చి రాములు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

హాలియా, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పల్‌రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. అనుముల ప్రాథమిక పాఠశాలలోని 4వ తరగతి విద్యార్థులకు గురువారం మెటీరియల్ అందజేశారు. స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ డైరెక్టర్ పల్‌రెడ్డి నర్సింహారెడ్డి, హెచ్‌ఎం సుబ్బారావు, ఉపాధ్యాయులు, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

హాలియా, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని సృజన డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ జూలకంటి అప్పారెడ్డి కోరారు. కళాశాల ఎదుట గురువారం ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వం సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయకపోవడంతో యాజమాన్యాలు అప్పులు చేసి కళాశాల అద్దె, అధ్యాపకుల వేతనాలు చెల్లిస్తున్నామని, కొత్త అప్పులు దొరకక కళాశాలలు నడుపలేక నిరవధిక బంద్‌ను పాటిస్తున్నామన్నారు.

పారదర్శకంగా కమిటీలు ఏర్పాటు చేయాలి

కేతేపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలు పారదర్శకంగా ఉండాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు కోరారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం ఏర్పాటు చేసే ఇందిరమ్మ కమిటీల్లో రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా పని చేసే వారికి చోటు కల్పించాలన్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య నాయకులు ఎల్. రాజు, వి. సౌదయ్య, బి. అంజయ్య, జె. లింగయ్య, ఎన్. వెంకన్న, జి. జోజి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు కృషిచేయాలి

గుర్రంపోడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు కృషిచేయాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా పౌరసరఫరాల అధికారి వి. వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని ఆమలూరు, పాల్వాయి గ్రామాల్లో గురువారం పర్యటించారు. ఆమలూరులో వైకుంఠగ్రామం, పల్లెప్రకృతివనం, రోడ్లు, డ్రైయినేజీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మంజుల, మండల విద్యాధికారి నోముల యాదగిరి, సివిల్ సప్లయి ఆర్‌ఐ రావుల సైదులుగౌడ్, పీఆర్ఏఈ శ్రీనివాస్‌రావు, గోపాల్‌రెడ్డి ఉన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గట్టుప్పల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత పాటించాలని గట్టుప్పల్ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ రాములు అన్నారు. మండలంలోని వెలమకన్నెలో గురువారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో మాట్లాడుతూ సంక్షేమ కార్యక్రమాలు అన్ని గ్రామాల్లో చేపడతామన్నారు.కార్యక్రమంలో విలేజీ స్పెషల్ ఆఫీసర్ శైలజ, హెచ్‌ఎం సుభాష్‌చంద్ర, పంచాయతీ కార్యదర్శి కృష్ణ పాల్గొన్నారు.

తిప్పర్తి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని తిప్పర్తి మండల ప్రత్యేక అధికారి ఛాయాదేవి అన్నారు. మండల పరిధిలోని సిలార్‌మియాగూడెంలో పర్యటించారు. అనంతరం ఎంపీడీవో ఎ. వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ, ఆశా, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ సిబ్బంది అలీ, ఆశా, అంగన్‌వాడీ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

భూమి కబ్జా చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

చింతపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తప్పుడు రికార్డులు తయారు చేసి భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని వింజమూరు గ్రామస్థులు కోరారు. మండలకేంద్రంలో తహసీల్దార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. వింజమూర్ గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 24లో దళితులకు ఇనాం భూమిలో ఓఆర్‌సీలను ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ఇందులో కొంతమంది ఆమడ్మెంట్ పెట్టుకొని ఆన్‌లైన్‌లో రికార్డు కలిగి ఉన్నారని, మరి కొంతమంది రైతులు ఓఆర్‌సీ తీసుకున్న వారికి అవగాహ లేకపోవడంతో ధరణి ఆన్‌లైన్‌లో తమ వివరాలను పొందుపర్చుకోలేదని తెలిపారు. సర్వే నంబర్ 24లో సర్వే నిర్వహించి అర్హులందరికీ న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆరేకంటి జంగయ్య, విజయ్‌కుమార్, వెంకటయ్య రాములు, భాగ్యమ్మ, ఆంజి, నరసింహ, ముత్తయ్య, ఏర్పుల రాజు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి



నిరసన తెలుపుతున్న కార్మికులు

మిర్యాలగూడ రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వేత నాలు చెల్లించాలని మిషన్‌భగీరథ కార్మికులు డిమాండ్ చేశారు. నాలుగు నెలల నుంచి వేతనాలు అందకపోవడంతో మండలం అవంతీపురం గ్రామంలోని మిషన్‌భగీరథ ప్లాంట్‌లో పనిచేస్తున్న కార్మికులు నిరసన తెలిపారు. మిర్యాలగూడ, హుజూ ర్‌నగర్‌కు చెందిన కార్మికులు గురువారం కాల్వపల్లిలోని వాటర్‌ట్యాంక్ ఎక్కి నిరసన తెలి పారు. తమకు వేతనాలను అం దించాలని కోరుతూ వారం రోజు లుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మిషన్ భగీ రథ ప్లాంట్ కార్మికులు ధనావత్ వేణు, వెంకట్, రవి, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

రేషన్ బియ్యానికి పాలిష్ చేసి..



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్ చంద్రపవార్

నల్లగొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని మిల్లుల్లో పాలిష్ చేయించి ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్న ముఠాను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ శరత్ చంద్రపవార్ కేసు వివరాలు వెల్లడించారు. రేషన్ బియ్యాన్ని పాలిష్ చేయించి ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారని జిల్లా పోలీసు అధికారులకు సమాచారం అందింది. దీంతో గురువారం ఉదయం దామరచర్ల మండలం వాడపల్లి గ్రామశివారులో ఆర్టీఏ సరిహద్దు చెక్‌పోస్టు వద్ద స్థానిక పోలీసులు, పౌరసరఫరాల అధికారులు కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు.

రూ.18లక్షల విలువైన 504.40 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణ వైపునకు కేఏ 56 2700 నెంబర్ గల లారీలో 245.40క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు. 30కిలోల బరువున్న 818 ప్లాస్టిక్ సూపర్ బ్యాగుల్లో నింపి తరలిస్తున్నారు. జీజే25 యూ2727 నంబర్ గల మరో లారీలో రూ.8లక్షల విలువైన 250క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బాపట్ల నుంచి గుజరాత్‌కు తరలిస్తుండగా చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకొని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. బియ్యాన్ని తరలిస్తున్న బాపట్లకు పట్టణానికి చెందిన చీమకుర్తి సుధాకర్, కర్ణాటక రాష్ట్రంలోని బసవకళ్యాణ్ జిల్లాకు చెందిన సయ్యద్ సలావోద్దీన్‌ను అరెస్టు చేశారు. గుంటూరుకు చెందిన మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. చీమకుర్తి సుధాకర్ కొన్ని సంవత్సరాలుగా బాపట్లలోని తనకు సంబంధించిన లక్ష్మీవెంకటేశ్వర అయ్యప్ప ట్రేడర్స్ నుంచి రైతుల నుంచి సేకరించిన ధాన్యంతో పాటు రేషన్ బియ్యాన్ని గుంటూరు, బాపట్ల, నర్సారావుపేటలో తక్కువ ధరకు కొనుగోలు చేసి తన మిల్లులోనే సన్న బియ్యం మాదిరిగా పాలిష్ చేయిస్తున్నాడు. ఆ బియ్యాన్ని 25కిలోలు, 30 కిలోలు ప్లాస్టిక్ సూపర్ బ్యాగుల్లో పార్సిల్ చేయించి వాటికి సంబంధించిన నకిలీ బిల్లులు తయారు చేసి అనుమానం రాకుండా తనకు తెలిసిన అశోక్ అనే వ్యక్తి ద్వారా నెలకు 10నుంచి 12లారీల లోడ్‌లను ఏపీ నుంచి ఇతర రాష్ట్రాలకు తరలించి వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో కర్ణాటకు చెందిన సయ్యద్ సలావోద్దీన్‌కు చెందిన లారీలో లోడ్ చేసిన బియ్యాన్ని అశోక్, సుధాకర్ తెలంగాణ మీదుగా ముంబైకి తరలించే క్రమంలో లారీని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన మిర్యాలగూడ డీఎస్పీ కె.రాజశేఖర్ రాజు, మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు, వాడపల్లి ఎస్ఐని, ఎస్పీ అభినందించారు.

పాత వాటికి టెండర్లు లేవు

కొత్తవాటికి అనుమతులు లేవు

(మొదటి పేజీ తరువాయి)

కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిని, అద్దంకి-నార్కెట్‌పల్లి స్టేట్ హైవేను కలుపుతూ నిర్మించిన రహదారి గుండా ప్రయాణించే వెసులు కల్పించారు. కాగా, కాల్వపల్లి అవంతీపురం మధ్యలో 300మీటర్లు, అవంతీపురం దిగువన గూడూరు మార్గం మధ్యలో 2.5కి.మీ మేర అటవీశాఖ అనుమతులు లభించక మరో రూ.8కోట్ల విలువైన రోడ్డు నిర్మాణ పనులు నిలిచాయి.

కాంట్రాక్టర్లు ముందుకు రాక

మంజూరైన పనులకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో టెండర్లు కాకుండానే కొన్ని పనులు నిలిచాయి. 2021-22 రూరల్ రోడ్ల మర్మతులకు రూ.7.55కోట్ల పనులకు, 2022-23లో రూ.9కోట్ల విలువైన 16 పనులకు, ఎస్టీఎఫ్ కింద గిరిజన ప్రాంతాల్లో 20 బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.31కోట్లు, సాగర్ నియోజకవర్గ పరిధిలో రూ.4కోట్ల విలువైన పనులకు నిధులు మంజూరయ్యాయి. అయితే కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో ఈ పనులు టెండర్ల దశలోనే నిలిచాయి.

ప్రభుత్వ అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం



రెండు నియోజకవర్గాలకు సంబంధించి 8 మండలాల్లో నూతన రోడ్ల నిర్మాణం, గ్రామీణ రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తాం. కాల్వపల్లి-గూడూరు బీటీ రోడ్డు పూర్తిచేసేందుకు అటవీశాఖ అనుమతులు కోరాం.

ఎం.వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్ ఈఈ, మిర్యాలగూడ.

ధాన్యం మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది



నార్కట్‌పల్లి: జువ్విగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరేశం



హాలియాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

నార్కట్‌పల్లి, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని నెమ్మాని, జువ్విగూడెం, తొండ్లాయి, శాపల్లి, నక్కలపల్లి, అమ్మనబోలు, అక్కెనపల్లి, మాండ్ర, బీ.వెల్లెంల గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించారు. రైతులకు మేలు చేయడంలో గత ప్రభుత్వం లాగా తమది మాటల ప్రభుత్వంకాదని చేతల ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్. వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో సుధాకర్, ఏపీఎం శ్రీదేవి, నాయకులు సట్టు సత్తయ్య, బండ సాగర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, రేగట్టె నర్సిరెడ్డి, నేతకాని కృష్ణయ్య పాల్గొన్నారు.

కట్టంగూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని అయిటిపాముల, కురుమర్తి, చెర్వుఅన్నారం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, ఎంఎస్‌వో కోటేశ్వర్‌రావు, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు, డీపీఎం మోహన్‌రెడ్డి, నాయకులు మాద యాదగిరి, పెద్ది సుక్కయ్య, రెడ్డిపల్లి సాగర్, నంద్యాల వెంకట్‌రెడ్డి, ఎండ్ల పెద్దరాములు, పెద్ది యాదగిరి ఉన్నారు.

నకిరేకల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని అమ్ముకుని మద్దతు ధర పొందాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ మండలంలోని మంగళపల్లి, చందంపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు ఐకేపీ సిబ్బందితో ఒకరికొకరు సమన్వయం చేసుకుని ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి, నకిరేకల్ పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ జమీరొద్దిన్, ఎంపీడీవో చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి గంగాధర్‌రావు, డీపీఎం మోహన్‌రెడ్డి, ఏపీఎం నరహరి పాల్గొన్నారు.

హాలియా, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి: విద్యార్థులు సమాజంలో రాణిచాలంటే పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. హాలియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 68వ డివిజన్ స్థాయి క్రీడా పోటీలను గురువారం ప్రారంభించి మాట్లాడుతూ క్రీడా పోటీల ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు స్నేహ సంబంధాలు మెరుగవుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల బలోపేతానికి పెద్దపీట వేసిందని మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కబడ్డీ క్రీడా పోటీలను ప్రారంభించి ఆట ఆడి విద్యార్థులను ఉత్సాహపరిచారు. మండల విద్యాధికారి గుండా కృష్ణమూర్తి అధ్యక్షత వహించగా కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ యడవల్లి అనుపమనరేందర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షులు కుందూరు వెంకట్‌రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గౌని రాజారమేష్‌యాదవ్, వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, పీఈటీల బాధ్యుడు వాసుదేవరావు, నాయకులు కాకునూరి నారాయణగౌడ్, పిల్లి ఆంజనేయులు, వెంపటి శ్రీనివాస్, నిమ్మల లక్ష్మారెడ్డి, కుకడాల ఆంజనేయులు, నాగరాజు, ఉపేందర్ హన్మంతరెడ్డి, మజార్ మొయినుద్దీన్, భానుప్రకాష్, నకిరేకంటి సైదులు, కోట నాగిరెడ్డి, సుధారాణి, పీఈటీ వెంకట్‌రాంరెడ్డి, శోభ తదితరులు పాల్గొన్నారు.

మృతదేహంతో ఆందోళన



శ్రీను ఇంట్లో ఉంచిన కొండయ్య మృతదేహం

మాడ్గులపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): భూతగాదాల్లో మండలంలోని నారాయణపురం గ్రామంలో దుండగుల కత్తిపోట్లతో బుధవారం వ్యక్తి దారుణహత్యకు గురైన నేపథ్యంలో గురువారం గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. స్థానికులు, కుటుంబసభ్యులు వివరాల తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాకునూరి కొండయ్య (64) ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు మద్యం మత్తులో వచ్చి కత్తులతో దాడిచేయగా విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు కొండయ్యను నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. కొండయ్య మృతికి భూతగాదాలే కారణమని కుటుంబసభ్యులు భావించడంతో కొండయ్య పెద్ద కుమారుడు సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. గురువారం కుటుంబసభ్యులు కొండయ్య మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చారు. తమ తండ్రి మృతికి కారణం తమ బాబాయి కాకునూరి శ్రీను కారణమని ఆరోపిస్తూ శ్రీను ఇంట్లో కొండయ్య మృతదేహాన్ని సుమారు మూడు గంటల సేపు ఉంచి ఆందోళన చేపట్టారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పరిస్థితి చేయిదాటిపోవడాన్ని గమనించిన పోలీసులు అక్కడికి చేరుకొని కొండయ్య మృతదేహాన్ని తన సోదరుడు శ్రీను ఇంట్లో నుంచి బయటకు తీయాల్సిందిగా బాధిత కుటుంబ సభ్యులను కోరారు. అందుకు వారు నిరాకరించగా మరోమారు పోలీసులు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. నిందితులను కఠినంగా శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో కొండయ్య మృతదేహాన్ని కుమారులు తమ ఇంటికి తీసుకెళ్లారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ వీరబాబు, ఎస్ఐ కృష్ణయ్య పోలీసు పికెట్ నిర్వహించారు. హత్యకు ప్రేరేపించిన వారిని, హత్యకు పాల్పడిన వారిని పట్టుకుంటామని, నిందితులెవరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని పోలీసులు తెలిపారు.

చండూరు మండల వ్యవసాయ అధికారిగా చంద్రిక

చండూరు రూరల్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): చండూరు మండల నూతన వ్యవసాయ అధికారిగా వడ్ల చంద్రిక గురువారం బాధ్యతలు స్వీకరించారు. వ్యవసాయ అధికారిగా ఎంపికై మొట్టమొదట బాధ్యతలు చండూరు మండలంలో చేపట్టారు. ఇక్కడ ఇన్‌చార్జి వ్యవసాయ అధికారిగా పనిచేసిన రేవతి గట్టుప్పల మండల వ్యవసాయ అధికారిగా కొనసాగుతున్నారు.

స్వచ్ఛమైన నీటిని అందించాలి



శిక్షణలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ వెంకటేశ్వర్లు

వేములపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేలా కృషిచేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎం. వెంకటేశ్వర్లు అన్నారు. మండలకేంద్రంలోని రైతువేదికలో వేములపల్లి, మాడ్గులపల్లి గ్రామ మంచినీటి సహాయకులకు చేతిపంపుల మరమ్మతులపై గురువారం నిర్వహించిన శిక్షణలో డీఈ వెంకట్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. గ్రామంలో మంచినీటి సరఫరా చేసే సమయంలో సహాయకులు క్షేత్రస్థాయిలో పైపులైన్ల నిర్వహణ క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎక్కడా నీటి సరఫరాలో లీకులు లేకుండా చూసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు నీటి శాంపుల్స్ సేకరించి ప్రయోగశాలకు పంపించి నీటి నాణ్యతను పరిశీలించుకోవాల్సిన బాధ్యత నీటి సహాయకులపై ఉందన్నారు. ఈ శిక్షణ తరగతుల ద్వారా గ్రామాల్లో మంచినీటి సరఫరాలో పైపులైన్ల లీకేజీ మరమ్మతులు, సింగిల్ ఫేజ్, త్రీఫేజ్ మోటార్ల రిపేర్, చేతిపంపుల రిపేర్, నీటి నాణ్యత తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నందున వాటిని సద్వినియోగం చేసుకోవాలని గ్రామ నీటి సహాయకులకు, మిషన్ భగీరథ సిబ్బందికి ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్లుఎస్ ఏఈ గంగాభవాని, శిక్షకులు జెర్రిపోతుల ప్రసాద్, క్రాంతికుమార్, వెంకన్న, శ్రీనివాస్, వెంకట్ పాల్గొన్నారు.

వాల్మీకి జీవిత చరిత్ర తెలుసుకోవాలి



చింతపల్లిలో వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

చిట్యాల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వాల్మీకి జీవిత చరిత్ర తెలుసుకోవాలని పలువురు వక్తలు కోరారు. మహర్షి వాల్మీకి జయంతిని గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. చిట్యాల ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో జయలక్ష్మి, ఎంపీవో రమేష్, ఏపీవో శ్రీలత కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కట్టంగూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కట్టంగూరులోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు, ఇన్‌చార్జి ఎంపీడీవో చలపతి ఉన్నారు.

చింతపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): చింతపల్లి ఎమ్మార్వో కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో రమాకాంత్, ఆర్ఐ సునిత, దాసరి శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కనగల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకుని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో వాల్మీకి చిత్రపటాలకు పూలమాలలు నివాళులర్పించారు. కార్యక్రమంలో తాహశీల్దారు పద్మ, డీటీ పార్వతమ్మ, సూపరెండెంట్ అండాలు, సీనియర్ అసిస్టెంట్లు విఘ్నేశ్వర్‌రెడ్డి, శ్రీరాములు, జూనియర్ అసిస్టెంట్లు గోవర్ధనబాయ్, ప్రియదర్శిని ఆర్‌ఐలు సునిత, యాదగిరి తదితరులు ఉన్నారు.

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సంస్కృత సాహిత్యంలో పేరెన్నిక గల వాల్మీకి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

శాలిగౌరారం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.యాదగిరి, ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి, ఎంపీవో పద్మ పాల్గొన్నారు.

చండూరు రూరల్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాంరెడ్డి మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సూపరిండెంట్ నర్సింహ్మా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా రమాశంకర్



దేవరకొండ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దేవరకొండ కోర్టులలో ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా సీనియర్ న్యాయవాది నెమికంటి రమాశంకర్‌ను నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వ న్యాయశాఖ కార్యదర్శి టి. తిరుపతి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ న్యాయవాదిగా ఆయన మూడు సంవత్సరాలపాటు సేవలు అందిస్తారు. రమాశంకర్ 23 సంవత్సరాలుగా దేవరకొండ కోర్టులో న్యాయవాదిగా పని చేస్తున్నారు.

వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును గౌరవించాలి

చండూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రంలో వర్గీకరణ అమలు చేయాలని మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు కురుపాటి సుదర్శన్ డిమాండ్ చేశారు. చండూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో ఉన్న 15శాతం రిజర్వేషన్లు తెలంగాణ ఏర్పడిన తర్వాత 20శాతానికి పెరిగాయన్నారు. అందుకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచి జనాభా నిష్పత్తి ప్రకారం మాదిగలకు 12శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఇరిగి గురునాథం, దండు పరుశురాం, తలారి పరమేష్, లక్ష్మణ్, చిరంజీవి పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా వరప్రసాద్



శాలిగౌరారం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల డిప్యూటీ తహసీల్దార్‌గా బిట్ల వరప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. వరప్రసాద్ మాడ్గులపల్లి నుంచి ఆయన బదిలీపై వచ్చారు. శాలిగౌరారంలో దీర్ఘకాలికంగా డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన మహ్మద్ అబ్దుల్ సత్తార్ కేతేపల్లి మండల తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

వేములపల్లి, అక్టోబరు 17: మండల కేంద్రంలో నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని సుమారు 125 మంది గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు పలురకాల వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం 30మందికి పలురకాల శస్త్ర చికిత్సలపై ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు అఖిల్, సురేష్, ప్రసన్న, తుషారా, మార్కెటింగ్ మేనేజర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి డిప్యూటీ తహసీల్దార్ బదిలీ

కేతేపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కేతేపల్లి డిప్యూటీ తహసీల్దార్ శింతల దివ్య బదిలీ అయ్యారు. రెండేళ్లకు పైగా ఇక్కడ డీటీగా పని చేస్తున్న దివ్య రెండు నెలలుగా సెలవుల్లో ఉన్నారు. ఈ క్రమంలో శాలిగౌరారం మండల డిటీ సత్తార్‌ను కేతేపల్లికి బదిలీ చేసిన రెవెన్యూ అధికారులు ఇక్కడి డీటీ దివ్యను మిర్యాలగూడ డివిజన్‌లోని నిడమనూర్ మండలానికి బదిలీ చేశారు. గురువారం కేతేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో నూతన డీటీగా సత్తార్ బాధ్యతలు చేపట్టారు.

అయిటిపాముల గౌడ సంఘం అధ్యక్షుడిగా సైదులు



కట్టంగూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయిటిపాముల గౌడ సంఘం అధ్యక్షులుగా అనంతుల సైదులును గురువారం ఎన్నుకున్నారు. అయిటిపాముల గ్రామంలో జరిగిన గ్రామశాఖ గౌడ కులస్థుల సమావేశంలో సైదులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ గౌడ కులస్తులు సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. గౌడ కులస్తులు ఎదుర్కొనే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లుతామన్నారు. తన నియామకానికి సహకరించిన గౌడ పెద్దలందరికి కృతజ్ఞతలు తెలిపారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్లపై కేసు నమోదు

నార్కట్‌పల్లి, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా చెరువు మట్టి తరలిస్తున్న ఏడు టిప్పర్ యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు. స్థానిక వివేరా హోటల్ వెనుక ఉన్న ప్రదేశం నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తుండగా సమాచారం రావడంతో వాటిని స్వాధీనపర్చుకుని మైనింగ్ శాఖకు అప్పగించామన్నారు. చెర్వులు, కాలువల నుంచి అనుమతి లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

ఎన్నికల్లో లబ్ధికే మద్దతు ధరల ప్రకటన

కేతేపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే కేంద్ర ప్రభుత్వం ఆరు పంటలకు మద్దతు ధరలను ప్రకటించిందని టీపీసీసీ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ అలుగుబెల్లి మహేందర్‌రెడ్డి విమర్శించారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాలు మినహాయించి ఇతర ఏ రాష్ట్రాల్లో పండించే పంటలకు కేంద్రం మద్దతు ధరలు ప్రకటించలేదన్నారు. కేవలం ఆయా రాష్ట్రాల్లో జరిగే ఎన్నికల్లో లబ్ది కొరకే మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల్లో పంటలకు ప్రభుత్వం మద్దతు ధరలు ప్రకటించిందన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

దేవరకొండ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని దేవరకొండలో ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు విద్యార్థి సంఘాల నేతలతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించి గురువారం ఆర్డీవో కార్యాలయ అధికారి అయూబ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రైవేట్ కళాశాల అసోసియేషన్ నాయకులు గుద్దేటి జంగయ్య మాట్లాడుతూ ప్రభుత్వం మూడు సంవత్సరాలుగా బకాయిలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని అన్నారు.